బెటాలియన్ ఎదుట కొనసాగుతున్న పోలీస్ బందోబస్తు

హాజీపూర్, అక్టోబర్ 28 : ఏక్ పోలీస్ విధానం అమలు చేయాలని కోరుతూ ఐదు రోజులుగా కొనసాగుతున్న బెటాలియన్‌లో విధులు నిర్వహిస్తున్న పోలీసులు, వారి కుటుంబ సభ్యులతో ఆందోళన చేపట్టారు. ఇందులో భాగంగా మండలంలోని 13వ ప్రత్యేక తెలంగాణ పోలీస్ బెటాలియన్ ఎదుట సివిల్ పోలీసుల బందోబస్తు కొనసాగుతున్నది. మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్, హాజీపూర్ ఎస్ఐ ఆధ్వర్యంలో 20 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తును ఏర్పాటు చేశారు. బెటాలియన్ నుంచి ఎవరూ రోడ్డు పైకివచ్చి ధర్నాలు చేయకుండా పహారా ఏర్పాటు చేశారు. మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ సోమవారం బెటాలియన్ ఎదుట బందోబస్తును పరిశీలించారు. ఇదిలా ఉండగా బెటాలియన్‌లోని పోలీసులు రోడ్డు పైకి రాకుండా బెటాలియన్ లోపలే తమ న్యాయమైన డిమాండ్ల కోసం నిరసన తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తమ తదుపరి నిర్ణయం ఉంటుందని బెటాలియన్ పోలీసులు తెలిపారు.

మున్సిపల్ సమస్యలు పక్కన పెట్టి కాకా పేరు తీర్మానం

బెల్లంపల్లి, అక్టోబర్ 28 : బెల్లంపల్లి పట్టణంలో అపరిష్కృతంగా ఎన్నో ప్రజా సమస్యలు ఉన్నా వాటిని పక్కన పెట్టి బెల్లంపల్లి ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనానికి కాకా వెంకటస్వామి పేరు పెట్టాలని మున్సిపల్ కౌన్సిల్ చేసిన తీర్మానం చేయడంపై ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనం వద్ద నిరసన తెలిపారు. వెంటనే ఆ తీర్మానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ పేరు ప్రస్తావనలోనికి వచ్చినప్పుడు ఎమ్మెల్యే గడ్డం వినోద్‌తో సహా కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా అంబేద్కర్ నామకరణం చేయాల్సి ఉండగా

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎంసీపీఐ(యూ) నాయకులు

కాంగ్రెస్ నాయకుడు కాకా పేరును తీర్మానించడం వారి అవివేకానికి నిదర్శనమని విమర్శించారు. అంబేద్కర్ పేరు పెడితే పట్టణంలోని అన్ని వర్గాల ప్రజలు ఏకగ్రీవంగా ఆమోదిస్తారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఆరెపల్లి రమేశ్, సతీశ్, సాయి, శేఖర్, అరుణ్, రాకేశ్, రవి, రాజు పాల్గొన్నారు.

మందుల విక్రయంపై విచారణ జరపాలి

కాగజ్‌నగర్, అక్టోబర్ 28: కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని ఈఎస్ఐ దవాఖానకు చెందిన మందుల విక్రయంపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దినాకర్, నియోజవర్గ ఇన్‌చార్జి ముంజం ఆనంద్, కమిటీ సభ్యుడు రాజేందర్ డిమాండ్ చేశారు. కాగజ్‌నగర్ పట్టణంలో ఈఎస్ఐ డిస్పెన్సరీకి చెందిన మందులు ఇటీవల కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ మందుల దుకాణంలో విక్రయిస్తుండగా పట్టుకున్న విషయం తెలిసిందే. ఈ విషయంపై ప్రత్యేక కమిటీవేసి పూర్తిస్థాయిలో విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధ శుక్లాకు సోమవారం వినతిపత్రం అందించారు.

సమస్యలు పరిష్కరించాలి

కాగజ్‌నగర్, అక్టోబర్ 28: కాగజ్‌నగర్ పట్టణంలోని జేకే పేపర్ మిల్లు సమస్య పరిష్కరించాలని జేకే పేపర్ మిల్లు కార్మికులు సోమవారం కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లాకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ, లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేసున్న నిరసన కారణంగా పేపర్ మిల్లులో ఉత్పత్తి అయిన పేపర్ స్టాక్ నిలిచిపోవడవంతోపాటు పేపర్ ఆర్డర్లు సైతం క్యాన్సల్ చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లారీలు మిల్లుకు రావడానికి ఆసక్తి చూపడం లేదని, లారీ అసోసియేషన్‌తో సామరస్యంగా చర్చలు జరిపి సమస్య పరిష్కరించాలని కోరారు.

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం

కాగజ్‌నగర్, అక్టోబర్ 28: శాంతి భద్రతల పరిరక్షణే పోలీసుల ధ్యేయమని కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం అన్నారు. కాగజ్‌నగర్ మండలంలోని ఈస్గం పోలీసు స్టేషన్ పరిధిలో బందోబస్తు నేపథ్యంలో జిల్లా ఎస్పీ శ్రీనివాస్ రావు ఆదేశాల మేరకు సోమవారం పోలీసులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఈస్గం పోలీసు స్టేషన్ పరిధిలో 80 ప్రత్యేక పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్ఐలు దీకొండ రమేశ్, రామన్, పోలీసు కానిస్టేబుళ్లున్నారు.

స్థలం కేటాయించాలని వినతి

లక్షెట్టిపేట, అక్టోబర్ 28: పట్టణంలో డే కేర్ సెంటర్ ఏర్పాటు కోసం స్థలం కేటాయించాలని కోరుతూ విశ్రాంత ఉద్యోగుల సంఘం సభ్యులు సోమవారం తహసీల్దార్ దిలీప్ కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఇక్కడ విశ్రాంత ఉద్యోగుల రాష్ట్ర నాయకులు శంకర్ గౌడ్, విశ్రాంత ఉద్యోగులు సాగర్, రాజు, అలీమ్, ఎక్బాల్‌జాన్ తదితరులున్నారు.

ప్రజావాణి దరఖాస్తులకు సత్వర పరిష్కారం

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, అక్టోబర్ 28 :ప్రజావాణి దరఖాస్తులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్ రావుతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. చింతలమానేపల్లి మండలం బాబాసాగర్ గ్రామానికి చెందిన గోలెం గంగ చీపూరు దుబ్బా గ్రామ శివారులో గల పట్టా భూమిలో వంశపారంపర్యంగా తనకు రావాల్సిన వాటా భూమిని ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. పెంచికల్ పేట మండలం పోతేపల్లి గ్రామానికి చెందిన అల్లూరి అజయ్‌కుమార్ తనకు కంటిచూపు లేనందున సదరం శిబిరంలో పరీక్ష నిర్వహించి ధ్రువపత్రం మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కౌటాల మండలం ముత్యంపేట గ్రామానికి చెందిన రైతులు తమ భూములకు సాగునీరు అందించాలని కోరారు. కెరమెరి మండలం గోయగాం గ్రామానికి చెందిన పవార్ రాము తన ఇంటిపైనుంచి విద్యుత్ తీగలు ఉన్నందున తొలగించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. రెబ్బెన మండలం ఇందిరానగర్ గ్రామానికి చెందిన పడిగల నరేశ్ గతంలో తమ గ్రామం సింగరేణి భూ సేకరణలో పోయినందున తనకు ఉపాధి కల్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. రెబ్బెన మండలం రాళ్ల పేట గ్రామానికి చెందిన రెడ్డి శ్రీనివాస్ వంకులం పంచాయతీలో మల్టీపర్పస్

దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

కార్మికుడిగా పనిచేస్తుండగా అన్యాయంగా తొలగించారని తిరిగి నియమించి తనను ఆదుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఆసిఫాబాద్ పట్టణానికి చెందిన కోరిడా ఓదెలు తన భార్య, కుమారుడు దివ్యాంగులు అయినందున పోషణకు ఇబ్బందిగా ఉందని, తనకు ఉపాధి కల్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. రెబ్బెన మండలం తక్కలపల్లి గ్రామానికి చెందిన బండ పోశం తన పేరిట గ్రామ శివారులో గల పట్టా భూమికి సంబంధించి పాసు పుస్తకం జారీ చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. దహెగాం మండలం దిగిడా రాంపూర్ గ్రామానికి చెందిన కోవ మారుభాయి తన పేరిట గల పట్టా భూమి ఆన్ లైన్‌లో నమోదు కానందున వివరాలు నమోదు చేసి పాసు పుస్తకం జారీ చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను అధికారుల సమన్వయంతో క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన జరిపి సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

చెన్నూర్ టౌన్, అక్టోబర్ 28 : సమస్యల పరిష్కారానికే ప్రజావాణి కార్యక్రమమని ఎంపీపీ అజ్మత్ అలీ పేర్కొన్నారు. మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ఏఈఈ సరిత, ఐకేపీ ఏపీఎం ప్రమీల, సీడీపీవో జూనియర్ అసిస్టెంట్ నిరుపమ, రెవెన్యూ విభాగ జూనియర్ అసిస్టెంట్ స్వామి, ఎంఈవో కార్యాలయ సీఆర్పీ సీహెచ్ రాజ్‌కుమార్, ఉపాధిహామీ పథకం ఏపీవో గంగాభవానీ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి ఒక్కరే హాజరు

కోటపల్లి, అక్టోబర్ 28 : మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ఒక్కరే అధికారి హాజరయ్యారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు ప్రజావాణికి హాజరుకావాల్సి ఉండగా ఉదయం 11 గంటలకు నమస్తే తెలంగాణ ప్రజావాణి కార్యక్రమాన్ని సందర్శించగా ఏపీవో బాలయ్య మాత్రమే ప్రజావాణికి హాజరయ్యారు. అన్ని శాఖల అధికారులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సహకార సంఘం సీఈవో సస్పెన్షన్

దహెగాం,అక్టోబర్28:ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈవో చప్పిడ బక్కయ్యను సోమవారం సస్పెండ్ చేసినట్లు డీసీవో రాథోడ్ బిక్క తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం, సహకార సంఘంలో ఎరువుల విక్రయాలు, రైతుల రుణాల వసూలు విషయంలో 2021-2022 సంత్సరాలకు చెందిన పాత రశీదులు ఉపయోగించాడని అదే విధంగా సహకర సంఘంలో వివిధ విషయాల్లో పలు అవినీతి ఆరోపణలు రావడంతో ప్రత్యేకాధికారిని నియమించి విచారణ జరిపించామన్నారు. విచారణలో అవకతవకలు చోటు చేసుకున్నాయని ఈ విషయంపై సీఈవో బక్కయ్య సస్పెన్షన్ చేసినట్లు పేర్కొన్నారు. పూర్తిస్థాయి విచారణ నివేదిక రాగానే తదుపరి చర్యలు తీసుకుంటామని డీసీవో పేర్కొన్నారు.

నేడు ధ్రువపత్రాల పరిశీలన

ఆసిఫాబాద్ టౌన్, అక్టోబర్ 28: డీఎస్సీ 2024లో 1:3లో ఎంపికైన స్పెషల్ ఎడ్యుకేషన్ అభ్యర్థులకు నేడు, రేపు జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని ఇన్‌చార్జి డీఈవో ఉదయ్‌బాబు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని సూచించారు.

సింగరేణి సీఎండీని కలిసిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు

శ్రీరాంపూర్, అక్టోబర్ 29: హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సింగరేణి సీఅండ్ఎండీ బలరాంనాయక్‌ను సోమవారం ఎస్టీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య నేతృత్వంలో మెంబర్లు కలిసి సమావేశమయ్యారు. సమావేశంలో రోల్ ఆఫ్ రిజర్వేషన్, 59 జీవో, ఇండస్ట్రియల్ మేనేజ్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రాంలు ఆరు నెలలుగా నిలిపి వేయడం తదితర అంశాలపై సీఎండీతో చర్చించినట్లు తెలిపారు. ఇక్కడ మెంబర్లు రేణిగుంట్ల ప్రవీణ్, కొంకటి లక్ష్మీనారాయణ, రాంబాబు నాయక్, జల్లి లక్ష్మీనారాయణ, కుసారం నీలదేవ్ తదితరులున్నారు.

బరాత్‌లో గొడవ

భీమారం, అక్టోబర్ 28 : భీమారం ఆవుడం రోడ్డులో ఆదివారం ఓ వివాహం కాగా బరాత్‌లో డీజే విషయంలో ఎనిమిది మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. బరాత్ విషయంలో యువకుల మధ్య తోపులాట జరుగగా, ఒక యువకుడిపై దాడి జరిగింది. కాగా, సోమవారం మధ్యాహ్నం యువకులు రెండు వర్గాలుగా ఏర్పడి గొడవపడ్డారు. శాంతికి భంగం కల్గించేలా వ్యవహరించడంతో ఇరువర్గాలకు చెందిన ఎనిమిది మందిపై హోంగార్డు సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు శ్వేతా తెలిపారు.

కార్యదర్శిపై విచారణ

జైపూర్, అక్టోబర్ 28: మండలంలోని మిట్టపల్లి పంచాయతీ కార్యదర్శిపై ఇటీవల సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదురాగా సోమవారం విచారణ చేపట్టారు. జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు మంచిర్యాల డీఎల్‌పీవో ధర్మారాణి విచారణ అధికారిగా వచ్చి గ్రామ పంచాయతీ కార్యాలయంలో విచారణ చేశారు. ఫిర్యాదుదారు తరుణ్, తాజా మాజీ సర్పంచ్, వార్డుసభ్యుల యొక్క వాంగ్మూలాలు నమోదు చేసి వివరాలను జిల్లా పంచాయతీ అధికారికి అందజేస్తామని విచారణ అధికారి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీపతి బాపురావు తదితరులు పాల్గొన్నారు.

చికెన్ తిని యువకులకు అస్వస్థత

కాగజ్‌నగర్ రూరల్, అక్టోబర్ 28: కాగజ్‌నగర్ మండల కేంద్రంలోని పెట్రోల్ పంపు ఏరియాలో నూతనంగా ఏర్పాటు చేసిన రెస్టారెంట్‌లో చికెన్ మండి తిన్న కాగజ్‌నగర్ మండలం నామానగర్ గ్రామానికి చెందిన ముగ్గురు యవకులు అస్వస్థతకు గురైనట్లు యువకుల తల్లిదండ్రులు తెలిపారు. వెంటనే దవాఖానకు తరలించినట్లు తెలిపారు. హోటల్ యజమానులపై అధికారులు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి

కాగజ్‌నగర్, అక్టోబర్ 28: కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో గల సర్వేనెంబర్ 143, 147/2లో గల ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయని, ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని సోమవారం కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లాకు మాజీ మున్సిపల్ కౌన్సిలర్ శేబ్బీర్ హుస్సేన్, కాంగ్రెస్ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ స్థలాన్ని కొందరు కబ్జా చేయాలని చూస్తున్నారని, వెంటనే విచారణ జరిపి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

మంచిర్యాల ఆర్డీవో బదిలీ

హాజీపూర్, అక్టోబర్ 28 : మంచిర్యాల రెవెన్యూ డివిజనల్ (ఆర్డీవో) అధికారి వడాల రాములును నిర్మల్ ల్యాండ్ అక్వేషన్‌కు బదిలీ అయ్యారు. కాగా ఆయన స్థానంలో వెయిటింగ్ ఫర్ పోస్టింగ్‌లో ఉన్న జీ శ్రీనివాస రావ్‌ను బదిలీ చేస్తూ రెవెన్యూ శాఖ ప్రిన్స్‌పల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్ సోమవారం ఉత్తర్వులను జారీ చేశారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

చెన్నూర్, అక్టోబర్ 28: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) జిల్లా అధ్యక్షుడు ఎస్ శ్రీనివాస్‌రావు డిమాండ్ చేశారు. చెన్నూర్ తహసీల్దార్ మల్లికార్జున్‌కు సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో తపస్ నాయకులు నాగరాజు, శ్రీకాంత్, సురేశ్‌లు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల పరామర్శ

మందమర్రి, అక్టోబర్ 28: బీఆర్ఎస్ చెన్నూర్ నియోజక వర్గ నాయకుడు డాక్టర్ రాజారమేశ్ కుటుంబ సభ్యులను బీఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకులు పరామర్శించారు. రాజారమేశ్ తండ్రి గొడిసెల రాయలింగు ఇటీవల అనారోగ్యంతో మరణించగా కరీంనగర్‌లోని తీగలగుట్టపల్లి గ్రీన్‌హోమ్స్‌లోని వారి ఇంటికి వెళ్లిన మందమర్రి పట్టణానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు రాయలింగు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇక్కడ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొంగల తిరుపతి రెడ్డి, టీబీజీకేఎస్ కేంద్ర ఉపాధ్యక్షుడు బడికెల సంపత్ కుమార్, ఏరియా నాయకులు పంజాల ఈశ్వర్, బిల్లా మాధవ రెడ్డి తదితరులున్నారు.

కోటపల్లి, అక్టోబర్ 28 : కరీంనగర్‌లో రమేశ్‌ను కోటపల్లి మండల బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పెద్దపోలు సాంబా

రాయలింగు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

గౌడ్, ఎరినాగుల ఓదెలు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఎరినాగుల ఓదెలు, మండల నాయకులు కొట్టె నారాయణ, అక్కల మధూకర్, కల్వకుంట్ల తిరుపతి రావ్, పూరెళ్ళ సతీశ్, కంకణాల సంపత్ రెడ్డి, రాళ్లబండి స్వామి, మారుపాక పోచం, అజ్మీర పున్నం, ఆసంపల్లి సంపత్, చెన్నూరి శంకర్, మారుపాక రాజేందర్, చాకి నరపు అజయ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థుల మధ్య ఘర్షణ

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 28 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్‌లో ప్రభుత్వ వైద్య కళాశాలలో ఆదివారం అర్ధరాత్రి జూనియర్, సీనియర్ విద్యార్థుల మధ్య గొడవ జరిగినట్లు తెలిసింది. ఆదివారం రాత్రి వాలీబాల్ ఆడుతుండగా గొడవ జరిగింది. జూనియర్ విద్యార్థుల తరపున బయటి వ్యక్తులు కళాశాలలోకి వచ్చి సీనియర్లపై దాడికి పాల్పడగా ఓ విద్యార్థికి స్వల్ప గాయాలైనట్లు తెలిసింది. దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని సీనియర్ విద్యార్థులు సోమవారం ఉదయం తరగతులను బహిష్కరించారు. విద్యార్థులతో పేరెంట్స్‌ను పిలిచి కళాశాల నిర్వాహకులు మందలించినట్లు సమాచారం. ఈ ఘటనపై మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ దావుద్ సులేమాన్ ను వివరణ కోరగా గొడవ జరిగింది వాస్తవమేనని, జూనియర్ సీనియర్ విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చామని తెలిపారు. ఈ గొడవపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని సీఐ ప్రమోద్‌రావు తెలిపారు.

ప్రాణహితలో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

వేమనపల్లి, అక్టోబర్ 28 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండల కేంద్రానికి చెందిన ముగ్గురు యువకులు శనివారం సోమిని గ్రామంలో ఎర్రబండ రేవు వద్ద ప్రాణహితనదిలో ఈతకు వెళ్లి గల్లంతవగా అందులో ఇద్దరి మృతదేహాలు ఆదివారం లభ్యమవగా మరో యువకుడి మృతదేహం సోమవారం వేమనపల్లి మండలంలో రాచర్ల గ్రామంలో లభ్యమైంది. ప్రాణహిత నదిలో యువకుడి మృతదేహాన్ని చూసిన మత్స్యకారులు పోలీసులకు సమాచారం అందించారు. వేమనపల్లి, బెజ్జూర్ పోలీసులు వచ్చి మృతదేహాన్ని పరిశీలించి మృతుడు మోహిజ్‌గా గుర్తించి, కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ఘటనలో జహీర్ హుస్సేన్, ఇర్షాద్ మృతదేహాలు బెజ్జూర్‌లోని తలాయి గ్రామం వద్ద ఆదివారం లభ్యమయ్యాయి.

సమస్యల సాధనకు పోరాటం

కాసిపేట, అక్టోబర్ 28 : టీచర్ల సమస్యల సాధన కోసం పీఆర్టీయూటీఎస్ అలుపెరుగని పోరాటం చేస్తుందని పీఆర్టీయూటీఎస్ జిల్లా గౌరవాధ్యక్షురాలు బండ శాంకరి స్పష్టం చేశారు. సోమవారం కాసిపేట మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో పీఆర్టీయూటీఎస్ నాయకులు ఎమ్మెల్సీ ఓటర్ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్, కరీంనగర్ఉపాధ్యాయ శాసన మండలి ఎమ్మెల్సీ అభ్యర్థి మహేందర్ రెడ్డిని గెలిపించాలని ఆమె కోరారు. ఇక్కడ పీఆర్టీయూటీఎస్ నాయకులు సాంబమూర్తి, రమణారెడ్డి తదితరులున్నారు.

ప్రాణాన్ని కాపాడే ఆయుధం హెల్మెట్

- మోటార్ సైకిల్ ర్యాలీలో సీఐ రవీందర్



బైక్ ర్యాలీలో పాల్గొన్న సీఐ రవీందర్, పోలీసులు, వాహనదారులు

చెన్నూర్ టౌన్, అక్టోబర్ 28 : హెల్మెట్ ఒక వస్తువు కాదని, ప్రాణాన్ని కాపాడే ఆయుధమని చెన్నూర్ పట్టణ సీఐ రవీందర్ పేర్కొన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో చెన్నూర్‌లో సోమవారం బైక్ ర్యాలీ తీశారు. స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి పెట్రోల్ బంక్ వరకు పోలీసులు, వాహనదారులు హెల్మెట్లు ధరించి బైక్ ర్యాలీ తీశారు. ర్యాలీలో పోలీసులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్, అక్టోబర్ 28: పోలీసు అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకుని సోమవారం శ్రీరాంపూర్ సర్కిల్ పోలీసులు ద్విచక్రవాహన దారులకు హైల్మెట్‌పై అవగాహన కల్పించారు. జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ బైక్‌ర్యాలీలో పాల్గొన్నారు. ఇక్కడ శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, జైపూర్, శ్రీరాంపూర్ ఎస్ఐలు శ్రీధర్, సంతోష్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించాలి

బెల్లంపల్లి/కాసిపేట, అక్టోబర్ 28 :ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించడంలో ప్రతి ఒక్కరు ప్రముఖ పాత్ర పోషించాలని ఎఫ్ఆర్వో పూర్ణచందర్ కోరారు. మండలంలోని బుగ్గ దేవాలయ పరిసర ప్రాంతాల్లో సోమవారం బెల్లంపల్లి అటవీశాఖ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థ పదార్థాలను ఆలయ సిబ్బంది, భక్తులతో, కమిటీ సభ్యులతో కలిసి తొలగించారు. ఇక్కడ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్లు ప్రవీణ్ నాయక్, తిరుపతి, శ్రీనివాస్, బీట్ ఆఫీసర్లు యుగేందర్, రాజు, శంకర్, శ్రీధర్, గోపీ, వెంకటేశ్, భాస్కర్, ఆలయ ఈవో బాపురెడ్డి, కమిటీ సభ్యులు శంకర్, భక్తులు, అధికారులున్నారు.

ఘనంగా గీతాహవన యజ్ఞం

సీసీసీ నస్పూర్, అక్టోబర్ 28: నస్పూర్ గోదావరి కాలనీ షిర్కె వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని గీతా ప్రశాంతి నిలయంలో గీతాహవన యజ్ఞాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. శ్రీమద్భవద్గీత సత్సంగం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో 22వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీమద్భవద్గీత సత్సంగం సొసైటీ అధ్యక్షుడు దాసరి రాజేశం ఉపన్యాసాలు, ఆధ్యాత్మిక ఉపన్యాసాలను భక్తులకు వివరించారు. ఇక్కడ సొసైటీ కన్వీనర్ డీడీ ప్రసాద్, కార్యదర్శి సీహెచ్ రాంబాబు, సభ్యులు మల్లేశ్, సమ్మయ్య, లక్ష్మీనారాయణ, సాంబార్ రాజన్న, దాసరి రాజేశ్వరి, శ్రీలక్ష్మి, మల్లేశ్, శంకరయ్య, పీ శంకర్, సారయ్య, తదితరులున్నారు.

టైగర్ కారిడార్ కేటాయించ వద్దు

కాగజ్‌నగర్ రూరల్, అక్టోబర్ 28: కాగజ్‌నగర్ మండలంలోని గిరిజన గ్రామాల్లో టైగర్ కారిడార్ కేటాయించవద్దని గిరిజన గ్రామాల ప్రజలు సోమవారం కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించారు. కాగజ్‌నగర్ మండలంలోని ఉట్నపల్లి, అంకుశాపూర్, రేగులగూడ, నందిగూడ గ్రామాల్లో కాగజ్‌నగర్ కారిడార్ పేరిట అటవీశాఖ అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు.

సమస్యలను పరిష్కరించాలి

కన్నెపల్లి, అక్టోబరు 28 : పెండింగ్ డీఏ, పీఆర్సీ తదితర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నాయకులు సోమవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. సంఘం రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బండి రమేశ్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం కేవలం ఒక డీఏను మాత్రమే ప్రకటించడం అన్యాయమన్నారు. ఇక్కడ జోగయ్య, నాయకులు శ్రీరాములు, సతీశ్, మోహన్, శ్రీకాంత్ తదితరులున్నారు.

ఉచిత వైద్య శిబిరం

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 28: సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు కరీంనగర్ మెడికవర్ దవాఖాన ఆధ్వర్యంలో సోమవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని చున్నంబట్టివాడలో ఉచిత గుండె వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఇక్కడ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నిర్వాహకులు గురువయ్య, డా.దీక్షిత్, మెడికవర్ దవాఖాన నిర్వాహకులు గుర్రం కిరణ్, మార్కెటింగ్ మేనేజర్ కర్ణాకర్, బొంగోని హరీశ్, రిటైర్డ్ కార్మికులున్నారు.

చెకుముఖి సైన్స్ సంబురాల పోస్టర్ల ఆవిష్కరణ

సీసీసీ నస్పూర్, అక్టోబర్ 28: నస్పూర్ మండల ప్రధానోపాధ్యాయులు, జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరిగే చెకుముఖి సైన్స్ సంబురాల పోస్టర్లను సోమవారం సీసీసీ నస్పూర్‌లో ఆవిష్కరించారు. ఇక్కడ జేవీవీ మంచిర్యాల జిల్లా గౌరవాధ్యక్షుడు బత్తిని దేవన్న ప్రధానోపాధ్యాయులు ఉపేందర్, తిరుపతి, చెన్నూరి అమాన్‌ప్రసాద్, అంబాల రాజ్‌కుమార్, తదితరులున్నారు.

క్యాతనపల్లి కమిషనర్‌గా రాజు బాధ్యతల స్వీకరణ

కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాజును సన్మానిస్తున్న కౌన్సిలర్లు

మందమర్రి, అక్టోబర్ 28: క్యాతనపల్లి మున్సిపాలిటీ కమిషనర్‌గా గద్దె రాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రామగుండం కార్పొరే